# 2. హితోక్తి

## ప్రతిపదార్థము - తాత్పర్యము

**1. శ్రీలాలిత్యము నిత్యశుద్ధియు గుణోత్సేకంబునం గల్గి యు**
**ద్వేలస్ఫూర్తిఁ దలిర్చు తండ్రియను నబ్ధింజంద్రుఁడై తోఁచినన్**
**బోలుంగాక భవాదృశుం డితరుఁడై పుణ్యంబులం బాసినన్**
**సాలగ్రామఖనిం జనించునెకదా జాత్యల్పపాషాణముల్.**

జ. ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| శ్రీ లాలిత్యము | = | సంపదలచే ఒప్పునట్టిది (తండ్రి పక్షమున) |
| శ్రీ లాలిత్యము | = | లక్ష్మీదేవిచే ఒప్పునది (లక్ష్మీదేవి పాల సముద్రమున పుట్టినది) (పాల సముద్రము పక్షమున) |
| నిత్య శుద్ధియున్ | = | ఎల్లప్పుడునూ పవిత్రత (తండ్రి పక్షములో) |
| నిత్య శుద్ధియున్ | = | ఎల్లప్పుడునూ స్వచ్ఛత (పాల సముద్రము పక్షములో) |
| గుణోత్సేకంబునున్ ( గుణ + ఉత్సేకంబునున్) | = | 'శమము, దమము' మొదలయిన గుణముల అతిశయమును (తండ్రి పక్షమున) |
| గుణోత్సేకంబునున్ | = | "గాంభీర్యము" మొదలయిన గుణముల అతిశయమునూ (పాల సముద్రము పక్షమున) |
| కల్గి | = | కలిగియుండి |
| ఉద్వేల, స్ఫూర్తిన్ | = | అతిశయమైన ప్రకాశముతో, అనగా బ్రహ్మ వర్చస్సుతో (తండ్రి పక్షమున) |
| ఉద్వేల స్ఫూర్తిన్ | = | తీరమును దాటునట్టి విజృంభణముతో (పాల సముద్ర పక్షమున) |
| తలిర్చు | = | ఒప్పునట్టి |
| తండ్రియను నబ్ధిన్; | = | |
| తండ్రి + అను + అబ్ధిన్ | = | తండ్రి అనే సముద్రము నందు |
| చంద్రుడై (చంద్రుడు + ఐ) | = | చంద్రుని వంటి వాడై |
| తోచినన్ | = | కన్పించినచో (ఉదయించినచో అని సముద్ర పక్షమున) |
| పోలున్ | = | ఒప్పును (తగియుంటుంది) (కాని) |
| భవాదృశుండు | = | నీ వంటివాడు |
| ఇతరుడై | = | పైవాని కంటే భిన్నముగా ఉన్నవాడై (తండ్రి గుణములకు విరుద్ధుడై) (చంద్రుని కంటె వేరైనవాడై అని సముద్ర పక్షమున) |
| పుణ్యంబులన్ | = | పుణ్య కర్మములను (ధర్మములను) |

పాసినన్ = విడిచిపెడితే

సాలగ్రామ ఖనిన్ = సాలగ్రామ శిలలు పుట్టే గనిలో

జాత్యల్పపాషాణముల్;

జాతి + అల్ప = జాతిచేత తక్కువయైన (హీనములైన)

పాషాణముల్ = రాళ్ళు (గులక రాళ్ళు)

జనించునె కదా = పుట్టినట్లే కదా!

**తాత్పర్యం:**

చక్కని సంపదలూ, నిత్యమూ నిర్మలముగా నుండడమూ, సద్గుణముల యొక్క అతిశయమూ కలిగి, అనంతమైన బ్రహ్మవర్చస్సుతో ఒప్పుతూ, సముద్రుడివలె ఉన్న మన తండ్రికి, నీవు చంద్రుడి వంటి పుత్రుడవు అయితే తండ్రికి తగిన కుమారుడివి అవుతావు. అలాగాక నీవు పుణ్యకర్మలు విడిచిపెడితే, సాలగ్రామములు దొరికే గనియందు అల్పమైన గులకరాళ్ళు పుట్టినట్లే కదా !

2. **ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహ మౌనంచునో**
**యేరా తమ్ముడ! నన్ను జూడఁ జనుదే వెన్నాళ్ళనోయుండి చ**
**క్షూరాజీవయుగంబు వాచె నినుఁగన్గో కున్కి మీబావయున్**
**నీరాకల్ మదిఁ గోరు చంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్.**

**ప్రతిపదార్థం:**

ప్రారంభించిన = మొదలు పెట్టిన (నీవు నీ శిష్యులకు చెప్పడం ప్రారంభించిన)

వేదపాఠమునకున్ = వేదములు నేర్పడానికి; (శిష్యులకు వేదం పాఠం చెప్పడానికి)

ప్రత్యూహము = విఘ్నము

ఔనంచున్ = అవుతుందనియేమో

ఏరా తమ్ముడ = ఒరే తమ్ముడూ!

నన్నున్ = నన్ను

చూడన్ = చూడ్డానికి

చనుదేవు = రావడం లేదు

నినున్ = నిన్ను

కన్గోకున్కి = చూడకపోవడం వల్ల

చక్షూరాజీవయుగంబు;

చక్షూరాజీవ (చక్షుః + రాజీవ) = పద్మములవంటి నా కన్నుల యొక్క

యుగంబు = జంట

వాంచెన్ = వాచిపోయింది

మీ బావయున్ = మీ బావగారు కూడా

చంద్రుపొడుపున్ = చంద్రోదయాన్ని (కోరుకునే)

నీరాకరంబున్‌బలెన్ = సముద్రము వలె

నీ రాకల్ = నీ రాకలను

www.sakshieducation.com

| | | |
|---|---|---|
| మదిన్ | = | తన మనస్సులో |
| కోరున్ | = | కోరుకుంటారు. (చంద్రోదయము కావాలని సముద్రము కోరుకున్నట్లు, నీ రాకను మీ బావ కోరుకుంటాడు.) |

**తాత్పర్యం :**

ఒరే తమ్ముడూ! నీవు ప్రారంభించిన వేద పాఠానికి విఘ్నము కలుగుతుందనేమో, నీవు నన్ను చూడ్డానికి ఎన్నాళ్ళనుండో రాటల్లేదు. నిన్ను చూడాలని నీ కోసం ఎదురుచూసి, నా కళ్ళు కాయలు కాశాయి. చంద్రోదయాన్ని సముద్రము కోరేటట్లు, నీ రాకను మీ బావ కోరుకుంటున్నాడు.

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. నిగమశర్మకు అక్కచెప్పిన హితవు ఏమిటి ?**

జ. **నిగమశర్మకు అక్కచెప్పిన హితోపదేశము :** 'ఒరే తమ్ముడూ ! నీవు మొదలుపెట్టిన వేద పాఠానికి విఘ్నం కలుగుతుందనేమో, నీవు నన్ను చూడ్డానికి చాలా రోజులనుండి రావడం లేదు. నిన్ను చూడాలని నీ కోసం ఎదురు చూసి చూసి, నా కళ్ళు కాయలు కాశాయి. సముద్రం చంద్రోదయాన్ని వలె, నీ రాకను మీ బావ కోరుతున్నారు.

మన తండ్రి చక్కని సంపదలు, నిత్య పరిశుద్ధి, సద్గుణ సంపద, బ్రహ్మవర్చస్సు కలవాడు. సముద్రుని వంటి అటువంటి తండ్రికి, నీవు చంద్రుడి వంటి పుత్రుడవు అయితే, తండ్రికి తగ్గ తనయుడవు అవుతావు. అలాకాక, నీవు పుణ్యకర్మలు విడిచిపెడితే, సాలగ్రామముల గనిలో గులకరాళ్ళు పుట్టినట్లు అవుతుంది.

తమ్ముడూ! నేను అత్తవారింటికి వెళ్ళాను. వీళ్ళు అందరూ చిన్నపిల్లలు. నీవు పెద్దవాడవు. ముసలివారైన తల్లిదండ్రులు నీ అండను కోరుకుంటారు. నీవు ఇలా ప్రవర్తిస్తే, మన తల్లిదండ్రులకు ఎంత దుఃఖము కల్గుతుందో ఆలోచించు.

తమ్ముడూ! బ్రహ్మ నుండి నీ తరము దాకా పరిశుద్ధమైన మన వంశాన్ని గురించి నీవు ఆలోచించడం లేదు. మరణకాలం సమీపించిన మన తల్లిదండ్రులను నీవు సంతోషపెట్టడం లేదు. అగ్ని సాక్షిగా పెళ్ళి చేసుకున్న అందమైన నీ భార్యను నీవు ఆదరించడం లేదు. ధర్మశాస్త్రములు తెలిసిన పండితులకు ధనమిచ్చి వారిని సంతోషపెట్టడం లేదు. నీ శీలము పిల్లి శీలము అనీ, నీవి చిల్కల చదువులు అనీ, నీ తోడివారు నవ్వేటట్లుగా ఎందుకు అవివేకిగా ప్రవరిస్తున్నావు ? ఈ గుణం నీకు ఎందుకు ?"

ఈ విధంగా నిగమశర్మ అక్క కోపంతో తమ్ముణ్ణి మందలించింది. తరువాత ఆమె తన కోపాన్ని విడిచిపెట్టి, తమ్ముడికి ఈ విధంగా ఉపదేశం చేసింది.

**అక్క మంచి మాటలు :** తమ్ముడూ! పడిపోతూ వణకిపోతున్న ఈ మన తల్లిదండ్రులనూ, ఇల్లు విడిచి బయటకు వెళ్ళలేని కుజ్జివాళ్ళయిన తమ్ముళ్ళనూ, క్రొత్తగా కాపురానికి వచ్చిన నీ భార్యనూ, నోరులేని పశువులనూ, సేవకులనూ, పశుల కాపరినీ పోషించే బాధ్యత, కర్ణుడి నెత్తిమీద భారతము నిలిచినట్లు, నీ మీదనే ఉంది.

"నా తమ్ముడు నీతి ప్రసిద్ధి చేత బ్రహ్మాదులను సహితమూ లెక్కపెట్టడు. నేను నా తమ్ముడు చేసే యజ్ఞములో పూజ్యురాలనైవేదిక మీద కూర్చుంటాను" అని ఎంతోమంది దగ్గర నేను చెపుతూ ఉంటాను. కాని నీవు ఏమీ లేకుండా, ఇలా సమస్త సదుణ హీనుడవు అయ్యావని, నాకు తెలియదు.

"తమ్ముడూ! వీరావేశంతో నీకున్న సమస్త ధనాన్ని ఖర్చు చేస్తే చేశావులే. కాని ఏడాదిలో మూడు కాలాల్లోనూ పంటలు పండే, ఆనకట్టలతో చుట్టుకొన్న కాశ్మీర ఖండపు వరిమడులను తెగనమ్మడం మాత్రం నీకు తగదు. నీకు భార్యలేదా ? నీ వెనుక తమ్ముళ్ళు మొదలయినవారు ఎవరూ లేరా ? వంశాన్ని నాశనం చేయడం నీకు తగదు.

ఇక మీదటనైనా, ఇటువంటి అవివేకాన్ని విడిచిపెట్టు. నేను చెప్పినట్లు బుద్ధిగా నడచుకో. నీకు కావాలంటే విష్ణుమూర్తి కంఠంలో ధరించే కౌస్తుభమణినయినా, నీకు తెచ్చి ఇస్తాను. కుత్సితులయిన తుంటరులను విడిచిపెట్టు. ఎప్పుడూ నీ చేయి పైన ఉండేటట్లు, దానధర్మాలు చేసినవాడవు. సంపూర్ణంగా కోరికలు నెరవేరినవాడివి. అదీగాక, నాకు తమ్ముడివి. నీవు ఇలా చేయడం తగదు.

## సందర్భ సహిత వాఖ్యలు

**1. సర్వగుణ హీనుఁడవౌట యెఱుంగ దమ్ముడా !**

జ. **కవి పరిచయం :** ఈ వాక్యం తెనాలి రామకృష్ణుడు రచించిన పాండురంగ మాహాత్మ్యంలోని తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడిన హితోక్తి అనే పాఠంలోనిది.

**సందర్భం :** నిగమశర్మ అక్క మొదట తమ్ముడిని మందలిస్తూ హితోపదేశం చేసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. అప్పుడు ఆమె తన కోపాన్ని తగ్గించుకొని సామరస్యంగా తమ్ముడి ముందు, తన మనోవేదనను ఇలా వెల్లడించింది.

తమ్ముడూ ! నీవు మంచివారు ప్రశంసించే నీతి ప్రశస్తిలో బ్రహ్మాదులను సహితమూ లెక్క చేయవనీ, నీవు చేసే యజ్ఞంలో నేను బాగా గౌరవింపబడి యజ్ఞవేదికపై కూర్చుంటాననీ, వేలాదిమందితో చెప్పకుంటూ ఉంటాను. కాని నీవు అది ఏమీ లేకుండా, ఈ విధంగా సర్వగుణ హీనుడవు అయ్యావని నేను తెలుసుకోలేకపోయాను అని తన బాధను వెల్లడిస్తూ నిగమశర్మ అక్క తమ్ముడికి హితోపదేశం చేసిన సందర్భంలోనిది.

**అర్థం :** తమ్ముడూ ! మంచి గుణములు ఏమీ లేనివాడవు అవుతావని నేను తెలిసికోలేకపోయాను.

**వ్యాఖ్య :** తమ్ముడి గురించి అక్క ఎంతగానో ఊహించుకొని, గొప్పగా పదిమందితో చెప్పకుందనీ, చివరకు తమ్ముడు ఏ మంచి గుణమూ లేనివాడిగా తయారయ్యాడని తాను తెలిసికోలేకపోయాననీ, అక్క తన బాధను తమ్ముడి ముందు వెల్లడించింది.

**2. కులధ్వంసంబు నీ కర్హమే ?**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం తెనాలి రామకృష్ణుడు రచించిన పాండురంగ మాహాత్మ్యంలోని తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడిన 'హితోక్తి' అనే పాఠములోనిది.

**సందర్భం :** నిగమశర్మ అక్కతమ్ముడిని మొదట బాగా కోపంతో మందలించింది. కానీ ప్రయోజనం కనబడలేదు. అప్పుడు ఆమె తన కోపాన్ని తగ్గించుకొని, సామరస్యంతో తమ్ముడి ముందు తన బాధను ఇలా వెల్లడించింది.

తమ్ముడూ! వీరావేశంతో నీకున్న ధనాన్ని అంతా ఖర్చు చేస్తే చేశావులే. కానీ ఏటా మూడు పంటలు పండేవీ, ఆనకట్టల ద్వారా నీరు సరఫరా అయ్యేవీ అయిన కాశ్మీర ఖండములు పండే వరిమడులను తెగనమ్మడం మాత్రం మంచిదికాదు. నీకు భార్య లేదా ? నీ వెనకాల తమ్ముళ్ళు ఎవరూ లేరా ? ఈ విధంగా కులధ్వంసం చేయడం నీకు ఉచితమేనా? అంటూ నిగమశర్మ అక్కగారు తమ్ముడిని మందలించి అతడికి హితోక్తి చెప్పిన సందర్భములోనిది.

**అర్థం :** వంశ నాశనాన్ని చేయడం నీకు ఉచితమా ?

**వ్యాఖ్య:** చేతిలోని డబ్బు "చరాస్తి" ని పాడు చేసినా ఫరవాలేదు. కాని స్థిరాస్తులైన మంచి పంటలు పండే పొలాలను ఇష్టం వచ్చిన రీతిగా అమ్మడం మాత్రం మంచిది కాదని అక్క తమ్ముడిని మందలించింది.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. నిగమశర్మ స్వభావం ఎట్టిది ?**

జ. నిగమశర్మ పీఠికాపురంలో నివసించే సభాపతి కుమారుడు. నిగమశర్మ వేదశాస్త్రాలు అభ్యసించాడు. కాని దుస్సాంగత్యం వల్ల చెడ్డ అలవాట్లకు బానిస అయ్యాడు. అతడు ఆచార వ్యవహారాలు వదలిపెట్టి, దొంగలు, జూదరులు, తాగుబోతులు మొదలయిన వారితో స్నేహం చేసేవాడు.

అతడు ముసలివారైన తన తల్లిదండ్రులనూ, తమ్ములనూ, భార్యనూ, కుటుంబ యోగక్షేమాలనూ పట్టించుకోకుండా, నిరంతరం దుర్జనులతో కలసి, భోగలాల సత్వంతో గడిపేవాడు. తండ్రి ఆస్తిని అంతా పాడుచేశాడు. అప్పుల పాలయ్యాడు.

నిగమశర్మ తన వంశ ప్రతిష్టను పట్టించుకొనేవాడు కాడు. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను ఆదరించేవాడు కాడు. ధర్మశాస్త్రములు తెలిసిన పండితులకు ధనములిచ్చి గౌరవించేవాడు కాదు. అతడిది పిల్లి శీలము అని, అతడి చదువులు చిల్కల చదువులు అని, అతని తోడివారు నవ్వేవారు. అతడు వీరావేశముతో తన ధనాన్ని అంతా ఖర్చుపెట్టడమే కాకుండా, ఏటా మూడు పంటలు పండే తమ వరి పొలాలను సైతం తెగనమ్మాడు.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. తెనాలి రామకృష్ణ కవి కాలమేది ?**

జ. తెనాలి రామకృష్ణ కవి కాలం 16వ శతాబ్దం.

**2. తెనాలి రామకృష్ణ కవి రచన ఒకటి పేర్కొనండి.**

జ. తెనాలి రామకృష్ణ కవి రచించిన గ్రంథం 1) పాండురంగ మాహాత్మ్యం

2) ఉద్భటారాధ్య చరిత్ర 3) ఘటికాచల మాహాత్మ్యం.

**3. పాండురంగ మాహాత్మ్యం అంకితం పొందినది ఎవరు ?**

జ. పాండురంగ మాహాత్మ్యంను "విరూరి వేదాద్రి మంత్రి" అంకితం పొందాడు.

**4. తెలుగు పంచకావ్యాలలో ఒకదానిని పేర్కొనండి.**

జ. తెలుగు పంచకావ్యాలలో 'పాండురంగ మాహాత్మ్యం" ఒకటి.

**5. నిగమశర్మ తండ్రి పేరేమి?**

జ. నిగమశర్మ తండ్రి పేరు 'సభాపతి'

**6. నిగమశర్మ నివాస స్థలమేది ?**

జ. నిగమశర్మ నివాస స్థానం "పీఠికాపురం" (లేదా)

నిగమశర్మ కళింగ దేశంలో ప్రసిద్ధమైన "పీఠికాపురం"లో నివసించేవాడు.

**7. నిగమశర్మకు అక్క ఎలాంటి భోజనాన్ని వడ్డించింది?**

జ. నిగమశర్మ అక్క నిగమశర్మకు ఇలవేల్పు అయిన విష్ణుమూర్తికి నైవేద్యము పెట్టిన మనోజ్ఞ భోజనాన్ని వడ్డించింది.

**8. నిగమశర్మ చదువులను తోటివారలేమని భావించారు ?**

జ. నిగమశర్మ చదువులను అతడి తోటివారలు "చిల్కల చదువులు" అని భావించారు.

**9. హరి నుండి ఏమి తెచ్చి ఇస్తానని నిగమశర్మకు అతని అక్కచెప్పింది ?**

జ. హరి నుండి కౌస్తుభమణిని తెచ్చి ఇస్తానని నిగమశర్మకు అతని అక్కచెప్పింది.

**10. పాండురంగ మాహాత్మ్యంలో ఏ క్షేత్ర మహిమను వర్ణించడమైనది ?**

జ. పాండురంగ మాహాత్మ్యంలో పండరిపుర క్షేత్ర మహిమ వర్ణింపబడింది.

✲✲✲

www.sakshieducation.com